ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

సోమవారం 18 నవంబరు 2024

పాత కక్షలతో మేస్త్రీ దారుణ హత్య

- కర్రతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి
- కాళ్లకల్ శివారులో ఘటన

7

ప్రాణాలు తీసిన బైక్ రైడింగ్

- కారును ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి



ఏడుపాయలలో ప్రధాన రహదారిపై పారుతున్న డ్రైనేజీ నీరు

మురుగు నీరు.. ప్లాస్టిక్ వ్యర్థాలు

- దిగువన పుణ్య స్నానాలు.. పై నుంచి డ్రైనేజి నీరు
- ఏడుపాయలలో భక్తుల అవస్థలు

పాపన్నపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల్లో పారిశుధ్యం పడకేసింది. పుణ్యస్నానాలు చేసే పాయల్లోకి డ్రైనేజీ నీరు ప్రవహిస్తున్నా పట్టించుకునే వారు లేక భక్తులు అవస్థలు పడుతున్నారు. వనదుర్గమ్మ ఆలయం ముందు నుంచి వెళ్లే నదీ పాయలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న హరిత హోటల్ డ్రైనేజీ పాడవడంతో మురుగంతా భక్తులు పుణ్యస్నానాలు చేసే పాయల్లో కలుస్తూ నీరు దుర్గంధభరితంగా మారుతున్నాయి. పుణ్యం కోసం వస్తే రోగాలు కొనితెచ్చుకుంటున్నామని భక్తులు వాపోతున్నారు. మరోవైపు ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఘనపురం ఆనకట్ట, నాగ్‌సాన్‌పల్లి వైపు చలిమకుంట, పోతన్‌శెట్టిపల్లి వైపు వైన్స్ తదితర ప్రాంతాల్లో భక్తులు టెంట్లు వేసుకుని విందులు చేసుకుంటారు. వారు వెళ్లిపోయిన అనంతరం మిగిలిపోయిన ప్లాస్టిక్ విస్తర్లు, గ్లాసులు అక్కడే వదిలేస్తుంటారు. ఆ వ్యర్థాలు శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. ఆలయ సిబ్బంది గుడి ప్రాంగణం మాత్రమే శుభ్రం చేయడంతో మిగిలిన ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. దోమలు, ఈగలు విజృంభించి అనారోగ్యాలు వ్యాపిస్తున్నాయి.

ఏడుపాయలలో భక్తుల సందడి



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ పరిసరాలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మంజీరా నదిపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తిక మాసం సందర్భంగా మహిళలు దీపాలు వెలిగించారు.

సంగారెడ్డి సదర్ ఉత్సవాల్లో జగ్గారెడ్డి

- వచ్చే రెండు ఎలక్షన్లలో ఒకసారి గొల్లకురుమల ప్రతినిధి చేర్యాల ఆంజనేయులుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్
- పండగలతో రాజకీయాలను ముడిపెట్టను
- మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- సదర్ సంబరాల్లో పాల్గొన్న జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డిలో జరిగిన సదర్ ఉత్సవాల్లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఐబీ వద్ద నిర్వహించిన సదర్ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. గొల్లకురుమల సమక్షంలో ఆయన దున్నరాజులపై ఆసీనులై డాన్సులు చేశారు. భజన పాటలు ఆలపించి హోరెత్తించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ వచ్చే రెండు ఎలక్షన్లలో ఒకసారి మాత్రం గొల్లకురుమల ప్రతినిధిగా ఉన్న చేర్యాల ఆంజనేయులకు కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని హామీ ఇచ్చారు. సదర్ సంబరాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని, ఇకపై ప్రతీసారి తన సహకారం ఉంటుందన్నారు. పండగలకు రాజకీయాలతో ముడిపెట్టబోనని జగ్గారెడ్డి అన్నారు. బతుకమ్మ, దసరా, బోనాలు, శ్రీరామనవమి వలె సదర్ ఉత్సవాలకూ సహకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, తోపాజి అనంతకిషన్, జూలకంటి ఆంజనేయులు, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేశ్, సదర్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రదీప్‌యాదవ్, బాలు యాదవ్, శ్రీశైలం యాదవ్, సతీశ్ యాదవ్, నాగు యాదవ్‌తోపాటు యువత, మహిళలు పాల్గొన్నారు.



దున్నరాజుపై ఆసీనుడైన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

పత్తి రైతు గోస

తొలుత అతివృష్టి.. ఆ తరువాత అతివృష్టి పత్తి పంటను దెబ్బతీశాయి. గతంతో పోలిస్తే దిగుబడి గణనీయంగా తగ్గింది. అసలే పంట దెబ్బతిని కుదేలైన రైతులను కూలీల కొరత కలవరపెడుతున్నది. స్థానికంగా కొరత ఉండడంతో పక్క రాష్ట్రాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్, పత్తికొండ, ఆదోని తదితర ప్రాంతాల నుంచి కూలీలు ఇక్కడికి వలస వచ్చి పత్తి తీస్తున్నారు. అయితే, ఇందుకోసం వారు అడిగినంత కూలి ఇవ్వాల్సి వస్తున్నది. ఇన్ని ఒడిదొడికుల మధ్య పత్తి తీసి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి.

- పత్తి తీసేందుకు పక్క రాష్ట్రాల కూలీలు
- మందకొడిగా సాగుతున్న పత్తి కొనుగోళ్లు
- జిల్లాలో 3,35,588 ఎకరాల్లో పంట సాగు
- తేమ శాతాన్ని సాకుగా చూపుతూ దళారుల దోపిడీ



మునిపల్లిలో పత్తి తీస్తున్న పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు

సంగారెడ్డి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3,35,588 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో అనావృష్టి, ఆ తరువాత అధిక వర్షాలు పత్తి పంట దెబ్బతీశాయి. దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. సాధారణంగా ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ ఈసారి కేవలం 6 నుంచి 10 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తున్నది. పంట దెబ్బతిని కుదేలైన రైతులను కూలీల కొరత మరింత కుంగదీస్తున్నది. పత్తి తీయడానికి స్థానికంగా కూలీల కొరత ఉండడంతో పక్క రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నారు. మరోవైపు జిన్నింగ్ మిల్లులు ఆలస్యంగా ప్రారంభం కావడంతో జిల్లాలో పత్తి కొనుగోలు మందకొడిగా సాగుతున్నది.

అడిగినంత ఇస్తేనే..

జిల్లాలో పత్తి తీసేందుకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో కొంతమంది వ్యాపారులు, రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, అనంతపురం, కర్నూల్, పత్తికొండ, ఆదోని, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, చించోలి తదితర ప్రాంతాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. వారికి కిలో పత్తి తీస్తే రూ.11 చొప్పున చెల్లిస్తున్నారు. మునిపల్లి, ఝరాసంగం, రాయికోడ్, ఝరాసంగం, మనూర్, అందోల్, కంగ్టి, సదాశివపేట తదితర మండలాల్లో వలస కూలీలతో పత్తిని తీయిస్తున్నారు. డిమాండ్ పెరగడంతో కూలి రేటు పెంచేస్తున్నారు. మధ్యవర్తుల కమీషన్ కూడా తోడవడంతో కూలి రేటు మరింత పెరుగుతున్నది.

మందకొడిగా కొనుగోళ్లు

జిల్లాలో పత్తి కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. జిల్లాలో పత్తిని కొనుగోలు చేసేందుకు 22 మిల్లులకు

మిగతా 8వ పేజీలో..

ఉమ్మడి జిల్లాలో పెరిగిన చలి తీవ్రత

నంగునూరులో 13 డిగ్రీలు, నల్లవల్లిలో 13.1 డిగ్రీలు, శివ్వంపేటలో 13.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

మెదక్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి రాత్రివేళలో శీతల గాలులు పెరగడంతో జనం వణుకుతున్నారు. ఉదయం వేళలో పొగమంచు కురువడంతో మరింత చలి పెరుగుతుంది. దాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలితో చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

- అత్యల్పంగా సిద్దిపేట జిల్లా నంగునూరులో 13 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రత నమోదు కాగా.. అంగడికిష్టాపూర్ 13.3, కొండపాక 13.4, చిక్కోడ్ 13.5, పోతారెడ్డిపేట 13.9, రేబర్తి 14.2, తిప్పారం 14.5, చిట్యాల 14.6, మిరుదొడ్డి 14.7, తుక్కాపూర్ 14.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- సంగారెడ్డి జిల్లా నల్లవల్లిలో 13.1, న్యాల్కల్ 13.9, అల్మాయిపేట 14 , అన్నాసాగర్ 14.1, లక్ష్మీసాగర్ 14.5, కొండాపూర్, కంగ్టి, కోహిర్ 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి
- మెదక్ జిల్లా శివ్వంపేట 13.5, డి.ధర్మారం 14 డిగ్రీలు, ఇస్లాంపూర్ 14.3, నాగాపూర్ 14.4, నార్లాపూర్ 14.5, చేగుంట 14.6, వెల్దుర్తి 14.7, పెద్దశంకరంపేటలో 14.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఐకేపీ కొనుగోలు కేంద్రంలో

దళారుల పాగా

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ప్రైవేట్ వ్యాపారులు తిష్టవేశారు. కేంద్రం నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. ఎదుల్లాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఓ వ్యాపారి ఆదివారం ఏకంగా కొనుగోలు కేంద్రం దగ్గరే కాంటా ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువకు కొనుగోలు చేసినట్టు రైతులు తెలిపారు.

-శివ్వంపేట, (ఆంధ్రజ్యోతి)



మెదక్ సీఎస్ఐని సందర్శించిన పాస్నెట్ కుటుంబ సభ్యులు

మెదక్ సీఎస్ఐ చర్చి నిర్మాణాన్ని తలపెట్టిన అప్పటి మిషనరీ రెవరెండ్ చార్లెస్ వాకర్ పాస్నెట్ కుటుంబ సభ్యులు ఆదివారం చర్చిని సందర్శించారు.ఎలిజబెత్, జూలియా, మైఖేల్, క్యారెల్, ఫ్రాంక్లిన్ ఆదివారం చర్చిని సందర్శించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

-మెదక్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి)

గ్రూప్-3 పరీక్షలు ప్రారంభం

తొలిరోజు ప్రశాంతం

కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

మెదక్‌లో తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

మెదక్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు జరిగిన పరీక్షకు 5,867 మంది అభ్యర్థులకు గానూ.. 3,187 మంది (54.32శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 5,867 మందికి గానూ 3,184 మంది (54.27శాతం) హాజరయ్యారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ సెంటర్ వద్ద ఒక ఎస్ఐ, నలుగురు పోలీసు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులు విధులు నిర్వర్తించారు. పరీక్ష కేంద్రాల లోనికి వెళ్లే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించారు. సెల్‌ఫోన్లు, హ్యాండ్‌బ్యాగులతో పాటు.. బెల్టు, బూట్లు వేసుకొచ్చినా లోనికి అనుమతించారు. కేంద్రం బయట ఏర్పాటు చేసిన కౌంటర్లలో పెట్టి అభ్యర్థులు లోనికివెళ్లారు. కొందరు అభ్యర్థులు ఉదయం పరీక్ష సరిగా రాయకపోవడంతో మధ్యాహ్నం హాజరు కాలేదు. జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేకపోవడంతో నిషేదం ఉండడంతో కలెక్టర్ సెల్‌ఫోన్ కారులోనే వదిలేసి వెళ్లారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లును ఎస్పీ ఉదయకుమార్‌రెడ్డి పరిశీలించారు.

సంగారెడ్డి జిల్లాలో 8,142 మంది హాజరు

పుల్‌కల్, (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో గ్రూప్-3 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 49 పరీక్షా కేంద్రాల్లో 15,163 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 8,142 మంది మాత్రమే హాజరయ్యారు. అభ్యర్థులంతా ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు పరీక్ష హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలంటూ పోలీసులు, అధికారులను బతిమిలాడినా అనుమతించలేదు. కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను అదనపు ఎస్పీ సంజీవరావు సందర్శించారు.



రామాయంపేటలో అధికారులను బతిమిలాడుతున్న అభ్యర్థి

ఆలస్యంగా వచ్చినవారికి నోఎంట్రీ

తొలిరోజు పలువురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయలేకపోయారు. నిమిషం నిబంధన కారణంగా వారిని అధికారులు కేంద్రాల్లోకి అనుమతించలేదు. మెదక్ పట్టణంలోని గీతా కళాశాల కేంద్రంలో ముగ్గురు, తూప్రాన్‌లో ఏడుగురు, రామాయంపేటలో ఐదుగురు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. నారాయణఖేడ్ నుంచి వచ్చిన ఓ అభ్యర్థిని, తూప్రాన్‌లో ఓ చంటిపిల్ల తల్లి అధికారులు, పోలీసుల కాళ్లావేళ్లా పడినా అనుమతించలేదు.



తూప్రాన్‌లో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న తూప్రాన్ సీఐ





సంగారెడ్డిలో హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు, భార్య పరీక్ష రాసేందుకు వెళ్లడంతో చిన్నారికి పాలు పడుతున్న తండ్రి



జ్యోతి ప్రజల్వన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న దామోదర్ రాజనర్సింహ

దౌర్జన్యం, గుండాగిరిని ప్రోత్సహిస్తున్న ప్రతిపక్షం

- లగచర్ల ఘటనతో తేటతెల్లం
- వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదకొండు నెలల ప్రజాపాలనను చూసి ఓర్చుకోలేక ప్రతిపక్షం దౌర్జన్యం, గుండాగిరీలను నమ్ముకుంటోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విమర్శించారు. జోగిపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలను ఆదివారం రాత్రి దామోదర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఫార్మా సిటీ భూముల విషయంలో లగచర్లలో జరిగిన ఘటన ప్రతిపక్షాల కుట్రకు నిదర్శనమని పేర్కొన్నారు. పదేళ్లుగా కుటుంబ పాలనను ఎంజాయ్ చేస్తూ.. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన ప్రతిపక్షం.. నేడు నిండా సంవత్సరం పూర్తి కాకపోయినా... ప్రజారంజక కాంగ్రెస్ పాలనను సహించలేకపోతోందని దుయ్యబట్టారు. అందుకే.. భూములే లేని వ్యక్తులను రప్పించి కలెక్టర్‌పై దాడి చేయించిందన్నారు. ఇది క్షమించరాని నేరమని, ప్రజాస్వామ్యంలో హింసకు దౌర్జన్యానికి తావులేదన్నారు. గతంలో కాళేశ్వరం భూనిర్వాసితుల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వమ్యబద్ధంగానే నిరసనలు తెలిపిందన్నారు. తాము అధికారంలో ఉండగా, నిరసనలు అణిచివేసి, నిరంకుశంగా వ్యవహరించిన ఆ పార్టీ.. నేడు అధికారం కోల్పోగానే, హింసను ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. పదేళ్లుగా రూ. 7 లక్షల కోట్ల అప్పు చేసిన అప్పటి ప్రభుత్వం... రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. కానీ, 11 నెలల్లోనే ఓవైపు అభివృద్ధి, సంక్షేమం చేపడ్తూనే, రూ. 55 వేల కోట్ల అప్పును తీర్చిన ఘనత రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ సర్కారుదేదన్నారు. సంవత్సరం పూర్తికాకుండానే 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, చంద్రశేఖర్, ఆర్డీవో పాండు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరకాలనీ కార్యవర్గం ఎన్నిక

నర్సాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని 9వ వార్డులో కొత్తగా ఏర్పడిన వెంకటేశ్వర కాలనీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.సుధాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా న్యాయవాది అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా శంకర్‌నాయక్, ప్రచార కార్యదర్శులుగా రాజు, చందర్, రమేష్, మన్నెరవి తదితరులను ఎన్నుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పాలకవర్గం సభ్యులు తెలిపారు.

గుంతలమయంగా మాచిరెడ్డిపల్లి రోడ్డు

కోహీర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహీర్ నుంచి మాచిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే నాలుగు కిలోమీటర్ల ప్రధాన రహదారి పూర్తిగా పాడై గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు పాడవడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల కేంద్రమైన కోహీర్ నుంచి మాచిరెడ్డిపల్లి, పీచేర్యాగడి గ్రామం మీదుగా జహీరాబాద్‌కు వెళ్లేందుకు అనుకూలంగా ఉన్న ఈ రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డును బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత పంచాయతీరాజ్ శాఖ అధికారులకు తెలియజేసినా ఇప్పటివరకు స్పందించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. పాడైన రోడ్డుకు కనీసం మరమ్మతులైన చేయాలని మాచిరెడ్డిపల్లి, పీచేర్యాగడి గ్రామస్తులు కోరుతున్నా అధికారుల్లో స్పందన కరువైందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు కనీసం మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన మాచిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి



కోహెడ మండలం పోరెడ్డిపల్లి గ్రామంలో మోయ తుమ్మెద వాగుపై రహదారితో పాటు నిర్మించిన చెక్‌డ్యాం



తంగళ్లపల్లి గ్రామంలో నిర్మించిన చెక్‌డ్యాం



కూరెళ్ల-తంగళ్లపల్లి గ్రామాల మధ్యన నిర్మించిన చెక్‌డ్యాం

చెక్‌డ్యాంలతో జలకళ

- మోయతుమ్మెద వాగుపై ఏడు చెక్‌డ్యాంలు
- రేణుకా ఎల్లమ్మ వాగుపై నాలుగు..
- గుండారెడ్డిపల్లిలో ఓగ్గె వాగుపై మరొకటి
- పెరిగిన నీటి నిల్వలు.. మత్స్య సంపద

కోహెడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల కాలంలో నీరు సహజంగా నిలిచే ప్రాంతాలను గుర్తించి ఆనాడే పలు చెరువులను నిర్మించారు. ఒక చెరువులోకి చేరిన నీరు నిండగా దాని నుంచి ప్రవహించే మిగులు నీరు అలుగు (మత్తడి) పారి మరొక చెరువు నిండుతుంది. అలా వరుసలోని చెరువులన్నీ నిండుతాయి. అలాగే మెట్ట ప్రాంతమైన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో అడుగంటిన భూగర్భ జలాలు పెంపొందించేందుకు 12 చెక్‌డ్యాంలు నిర్మించారు. కాకతీయుల చెరువుల మాదిరిగా తెలంగాణ ఏర్పడిన తర్వాత గొలుసుకట్టు చెక్‌డ్యాంల నిర్మాణాలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాగులపై చేపట్టింది. వర్షాకాలంలో ఈ వాగుల ద్వారా పరిగెత్తే నీటిని చెక్‌డ్యాంల నిర్మాణంతో అడ్డుకట్ట వేశారు. ఈ చెక్‌డ్యాంలతో జలకళ సంతరించుకుంది. తద్వారా సాగునీటితోపాటు భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బావులతో పాటు తాగునీరు లభిస్తుంది. ఆయకట్టుకు సాగునీరు సమృద్ధిగా లభిస్తుండడంతో ఆకుపచ్చ తివాచీ పరిచినట్టు కనిపిస్తూ పంట పొలాలు కనువిందు చేస్తున్నాయి.

మోయతుమ్మెద వాగుపై 7 చెక్‌డ్యాంలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డీ జనరేషన్ ఆఫ్ వాటర్ స్కీమ్ కింద 2020లో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టింది. కోహెడ మండలంలోని పోరెడ్డిపల్లి, బస్వాపూర్, తంగళ్లపల్లి, కూరెళ్ల, వింజపల్లి, వరుకోలు గ్రామాల్లో మోయతుమ్మెద వాగుపై సుమారు 20 కిలోమీటర్ల దూరంలో రూ.58 కోట్లతో ఏడు చెక్‌డ్యాంలు నిర్మించారు. హుస్నాబాద్ మండలంలోని పందిళ్ల, పొట్లపల్లి, నకెరెకొమ్ముల, నారాయణపూర్ గ్రామాల్లోని రేణుకాఎల్లమ్మ వాగుపై 10 కిలోమీటర్ల దూరంలో రూ.22 కోట్లతో మరో నాలుగు చెక్‌డ్యాంలు నిర్మించారు. గుండారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ఓగ్గె వాగుపై రూ.6.30 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు.

నాడు కరువు ప్రాంతం.. నేడు జలకళ

చెరువులు, కుంటలు ఎండిపోయి వాగుల్లో నీరు లేక ఎడారిలా తలపించేలా కనపడిన ఈ కరువు ప్రాంతం.. నేడు హుస్నాబాద్ నియోజకవర్గంలో చెక్‌డ్యాంల నిర్మాణాలతో వాగులపై జలకళ సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గత ప్రభుత్వం చేపట్టిన చెక్‌డ్యాం పనులు ఇందుకు బలాన్ని చేకూర్చాయి. గతనెలలో కురిసిన వర్షాలకు చెరువులు నిండి మత్తళ్లు పారాయి. వాగులు, వంకలు ఉధృతంగా వరద నీరుతో ప్రవహించాయి. భూగర్భజలాలు వృద్ధి చెందడంతో బీడు భూములు సేద్యమవుతున్నాయి. నీటి నిలువలు పెరిగాయి. నీరు ఉండడం వల్ల మత్స్య సంపద పెరిగి మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి.

జీవనదిలా మోయతుమ్మెద వాగు

సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక, చేర్యాల, సిద్దిపేట ఎగువ ప్రాంతాల్లోని చిన్నచిన్న వాగుల నుంచి వచ్చే వరదనీరు కోహెడ మండలం పోరెడ్డిపల్లి గ్రామం వరకు వచ్చి పెద్దగా మారుతుంది. మండలంలోని పోరెడ్డిపల్లిలో మోయతుమ్మెద వాగు ప్రారంభం అవుతుంది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం లోయరు మానేరు డ్యాంలో ఈ వాగు కలుస్తుంది. ఈ మోయ తుమ్మెద వాగుపై ఒక్క కోహెడ మండలంలోనే ఏడు చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టడంతో జీవనదిలా మారిపోయింది. చెక్‌డ్యాంల నిర్మాణంతో బతుకమ్మలు, వినాయక నిమజ్జనానికి ఇబ్బంది లేకుండాపోయింది. అలాగే రేణుకా ఎల్లమ్మవాగు కూడా లోయర్ మానేరు డ్యామ్‌లో కలుస్తుంది.

తొలగిన రాకపోకల ఇబ్బందులు

కోహెడ మండలంలోని నారాయణపూర్ గ్రామం వద్ద రేణుకా ఎల్లమ్మ వాగు వరద ఉధృతి ఉన్నప్పుడు నూతనంగా ఏర్పడిన విజయనగర్ కాలనీ గ్రామపంచాయతీకి ప్రతిఏటా రాకపోకలు నిలిచిపోయేవి. ఈ వాగుపై చెక్‌డ్యాంతో పాటు వంతెన కూడా నిర్మించడంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి. అలాగే పోరెడ్డిపల్లి గ్రామం వద్ద వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంతో పది కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగసముద్రాల రెండు కిలోమీటర్ల దూరంలో దగ్గరగా అయ్యింది. అలాగే మండల కేంద్రానికి మరింత దగ్గర కావడంతో గ్రామస్థుల ఇబ్బందులు తొలగిపోయాయి.

క్రైం కార్నర్

కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య



సోనుబాయి(ఫైల్)

మర్కుక్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం యూసప్‌ఖాన్‌పల్లిలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ దామోదర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కెన్సర్ సోనుబాయి(20)ని ఏడునెలల క్రితం అదే గ్రామానికి చెందిన అమర్‌సింగ్‌కు ఇచ్చి వివాహం చేశారు. అంతకు ముందు నుంచే సోనూబాయికి తరచూ కడుపునొప్పి వస్తుండేది. ఇటీవల మళ్లీ నొప్పి రావడంతో గజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. శనివారం కూడా కడుపులో నొప్పి వస్తుందని తల్లి పద్మినీబాయికి చెప్పింది. తాను బయటకు వెళ్లి వచ్చిన తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్తానని చెప్పింది. ఇంతలో నొప్పి ఎక్కువకావడంతో భరించలేక ఇంట్లోని పై కప్పుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి ఇంటికి వచ్చి చూసేసరికి సోనూబాయి ఉరేసుకుని ఉండడంతో వెంటనే గజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న డీసీఎం

- నలుగురికి గాయాలు

మాసాయిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆటోను డీసీఎం ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన 44వ జాతీయ రహదారిపై మాసాయిపేట వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. మాసాయిపేటకు చెందిన ఆటో తూప్రాన్‌కు వెళ్లేందుకు ప్రయాణికులతో బస్టాండ్ వద్ద ఆగి ఉన్నది. ఈ క్రమంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం ఆటోను వెనకనుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న చందాయిపేటకు చెందిన చంద్రయ్య, మాసాయిపేటకు చెందిన గోపాల్, పెంటయ్య, బాలమ్మకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా తూప్రాన్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, చేగుంట పోలీసులకు సమాచారమందించారు.

నిబంధనలకు విరుద్ధంగా సెల్‌టవర్

- పంచాయతీరాజ్ శాఖ అధికారులకు తెలియకుండానే నిర్మాణం
- గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని గ్రామస్థుల డిమాండ్

కోహీర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం ఖానాపూర్‌లో ఓ ప్రైవేట్ సంస్థ వారు నిబంధనలకు విరుద్ధంగా గ్రామ సమీపంలో భారీ సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ టవర్ నిర్మాణం పూర్తికావస్తున్నా ఇప్పటివరకు అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ఈ విషయంపై గ్రామపంచాయతీ, మండల పంచాయతీ అధికారిని వివరణ కోరగా.. టవర్ నిర్మాణ విషయం తెలియదని చెప్పారు. నిబంధన ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో సెల్‌టవర్‌ను ఏర్పాటు చేయాల్సివస్తే.. సదరు సంస్థ వారు గ్రామసభ ఏర్పాటుచేసి సెల్‌టవర్ నుంచి ఎంతశాతం రేడియేషన్ వస్తుందో తెలియజేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా గ్రామసభ తీర్మానం ద్వారా నో-ఆబ్జెక్షన్ తీసుకొని ప్రభుత్వానికి టవర్ ఇన్‌స్టాలేషన్ ఫీజు చెల్లించి పాఠశాలకు, ఆలయాలకు, గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఖానాపూర్‌లో ప్రధాన రహదారికి దగ్గరలో.. పాఠశాలకు కూతవేటు దూరంలోనే ఏర్పాటుచేశారు. దూరంగా ఏర్పాటు చేయాలని ఖానాపూర్, కొత్తూరు(కె) గ్రామస్థులు పేర్కొన్నారు.



ఖానాపూర్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న సెంటర్

పాత కక్షలతో మేస్త్రీ దారుణ హత్య

- కర్రతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి
- కాళ్లకల్ శివారులో ఘటన

మనోహరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో మేస్త్రీ దారుణ హత్యకు గురయ్యాడు. మేస్త్రీ కింద పనిచేసేవాడే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధి కాళ్లకల్ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమోద్ పాశ్వాన్(43) మేస్త్రీ పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కాళ్లకల్‌లో ఇల్లు కడుతున్నాడు. ఆ ఇంటికి సంబంధించిన పనులను పాశ్వాన్ ఇతర కూలీలతో నిర్మిస్తున్నాడు. బీహార్‌కు చెందిన బిట్టు అనే వ్యక్తి భార్యాపిల్లలతో కలిసి పాశ్వాన్ కింద పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా నిర్మాణం ఇంట్లోనే ఉంటూ పనులు చేస్తున్నారు. గతంలో బిట్టుకు, పాశ్వాన్‌కు కొద్దిపాటి గొడవ జరిగింది. అది మనసులో పెట్టుకున్న బిట్టు శనివారం రాత్రి ప్రమోద్ పాశ్వాన్‌ను కర్రతో తలపై కొట్టగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై సూపర్‌వైజర్ పుట్ట నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న తూప్రాన్ సీఐ రంగాకృష్ణ

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రుల చెంతకు..

జహీరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తప్పిపోయిన బాలికను పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన రెండేళ్ల పాప తప్పిపోయి రాచన్నపేట సమీపంలోని బాగారెడ్డిపల్లికి పోయే బ్రిడ్జి వద్దకు ఆదివారం ఉదయం వచ్చింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాపను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. పాప తప్పిపోయిన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో పాటు పోలీసులు పలువురికి సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు సునీత, లోకేష్ పవార్ పోలీస్‌స్టేషన్‌కు వివరాలతో రావడంతో పాపను వారికి అప్పగించామని పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. వీరు కర్ణాటక రాష్ట్రం, చించోళీ ప్రాంతంలోని గుండునాయక్ తాండకు చెందినవారు.



బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

భూమి పోతుందని.. మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

దుబ్బాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోదతతి): తనకు జీవనోపాధిగా ఉన్న ఎకరం భూమి పంట కాలువలో పోతుందన్న ఆవేదనతో ఓ మహిళా రైతు ఆదివారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన దుబ్బాక మండలం కమ్మర్‌పల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోడ మల్లయ్య(50)కు పటేల్‌చెరువు శిఖంలో ఎకరం భూమిలో కొన్నేళ్లుగా ఎక్ ఫసల్ పంటగా సాగుచేసేవాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 30 ఏళ్ల క్రితం మల్లయ్య మరణించగా, ఇప్పుడు ఆయన కుమారుడు బోడ ఉప్పలయ్య ఆ భూమిని సాగు చేస్తున్నాడు. అతనికి ఉద్యోగం రావడంతో ఆ భూమిని భర్తతో విడిపోయిన సోదరి మల్లవ్వకు ఇచ్చాడు. అప్పటి నుంచి ఆమె సాగు చేసుకుంటోంది. అయితే, పటేల్‌చెరువులోని శిఖం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, మల్లన్నసాగర్ నుంచి ఉప కాలు(4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువ)ను అనుసంధానం చేసింది. కాలువలో భూమి కోల్పోవడంతో తన జీవనాధారం పోయిందని మల్లవ్వ ఆవేదనకు గురైంది. తనకు రావాల్సిన పరిహారాన్ని మాజీ ఎంపీటీసీ అడ్డుకుంటున్నారని ఆదివారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. అయితే, తన పరిహారం విషయాన్ని మాజీ ఎంపీటీసీని నిలదీస్తే 'పురుగుల మందు తాగి చావు' అంటూ దూషించాడని.. దీంతో పురుగుల మందుతాగినట్లు బాధితురాలు ఆరోపించారు. అయితే, పరిహారం విషయం తనకు సంబంధం లేదని మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి పేర్కొన్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు తెలిపారు.

కుంటలో పడి వ్యక్తి మృతి

అల్లాదుర్గం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుంటలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గిరిజనతండా శివారులోని దేవులకుంటలో ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అద్దంకికి చెందిన జగపతిబాబు(27) జీవనోపాధి కోసం తెలంగాణకు వచ్చాడు. కాగా సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పోతుబొగుడలో ఓ ఇంటి నిర్మాణ పనుల్లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 15న పోతులబొగుడలో చేపట్టిన ఇంటి నిర్మాణం పనులు ముగించుకుని అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గిరిజనతండాలో ఓ ఇంటి నిర్మాణం పనుల కోసం వెళ్లారు. శనివారం ఉదయం జగపతిబాబు టిఫిన్ కోసం మండలంలోని గడిపెద్దాపూర్ వెళ్తున్నట్లు అక్కడున్న మేస్త్రీకి హరిబాబుకు చెప్పాడు. టిఫిన్ కోసం వెళ్లిన జగపతిబాబు ఎంతకూ తిరిగిరాకపోవడంతో మేస్త్రీ హరిబాబు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా ఆదివారం తండా శివారులోని దేవులకుంటలో ఓ వ్యక్తి మృతదేహం తేలి ఉండటంతో తండావాసులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ ఘటనపై కుటుంబీకులకు సమాచారమందించామని చెప్పారు. మేస్త్రీ హరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండుతలల లేగదూడ జననం

నారాయణఖేడ్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌లోని ఓ రైతుకు చెందిన గేదెకు ఆదివారం రెండుతలల లేగ దూడ జన్మించింది. గ్రామానికి చెందిర సాయిరెడ్డి అనే రైతుకు సంబంధించిన గేదెకు ఒకే ఈతలో రెండు తలలు కలిగి ఉన్న ఓ దూడ జన్మించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రజలు దూడను చూసేందుకు ఆసక్తి చూపారు. కాగా రెండు తలలతో జన్మించిన లేగ దూడ గంట తర్వాత మృతిచెందిందని స్థానికులు తెలిపారు.



రెండు తలల లేగదూడను చూయిస్తున్న రైతులు

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే మెదక్ జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారామెడికల్ కోర్సుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రవీందర్‌కుమార్ తెలిపారు. తెలంగాణ పారా మెడికల్ బోర్డు సెక్రటరీ నోటిఫికేషన్ అనుగుణంగా మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిడిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్ 30 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్తీసియా టెక్నీషియన్ 30 సీట్లు ఉన్నాయన్నారు. కోర్సుల ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కోరారు. 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7702260905 నెంబరులో సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

ప్రాణాలు తీసిన బైక్ రైడింగ్

- కారును ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి





ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, కళ్యాణ్‌రెడ్డి(ఫైల్)

నర్సాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడికి బైక్ రైడ్ అంటే అమితమైన ఇష్టం.. చివరకు ఆ బైక్ రైడింగ్ పిచ్చే అతడి ప్రాణాలు తీసింది. బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొని ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలో చోటు చేసుకున్నది. నర్సాపూర్ పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన కళ్యాణ్‌రెడ్డి(19) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సెలవు దినాల్లో తన బీఎండబ్ల్యూ బైక్‌పై దూరం ప్రయాణం చేయడం ఇష్టపడేవాడు. ఆదివారం ఉదయం కళ్యాణ్‌రెడ్డి తన స్నేహితుడు రుషిల్ ఇద్దరూ చెరో బైక్‌పై హైదరాబాద్ నుంచి జోగిపేటకు రైడ్ చేద్దామనుకున్నారు. ఇందులో భాగంగా జోగిపేటకు వెళ్లి అక్కడి నుంచి నర్సాపూర్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్ మండలం కొండాపూర్ అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కళ్యాణ్‌రెడ్డి బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొని కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ కృష్ణతో పాటు సిబ్బంది అక్కడికి చేరుకుని పోస్టుమార్టం కళ్యాణ్‌రెడ్డి మృతదేహాన్ని నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. మరో బైక్‌పై ఉన్న తన స్నేహితుడు రుషిల్ ఈ విషయాన్ని కళ్యాణ్‌రెడ్డి కుటుంబీకులకు తెలిపాడు. వారు వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుడి తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య



రాంరెడ్డి(ఫైల్)

చిన్నకోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చెట్టుకు ఉరేసుకుని ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు గ్రామానికి చెందిన కర్నె రాంరెడ్డి(70) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్దిరోజులుగా రాంరెడ్డికి తన సోదరుడితో భూమి పంపకాలు, తల్లిని పోషించే విషయంలో వివాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో రాంరెడ్డి వారంరోజులుగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి, అదేవిధంగా పెద్ద మనుషులను కలిసి మాట్లాడి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఉదయం బావి వద్దకు వెళ్లిన కుమారుడు సుధాకర్‌కు తండ్రి రాంరెడ్డి కనిపించలేదు. చుట్టుపక్కల వెతకగా.. ఓ చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

అప్పులబాధతో వ్యక్తి..



రాములు(ఫైల్)

రాయపోల్/గజ్వేల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రాయపోల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రాయపోల్‌కు చెందిన ఉషనగల్ల రాములు(56) ఈ నెల 16న ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా రాములు అప్పులు పెరిగాయని, ఆరోగ్యం బాగాలేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి ముందు గల మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం 3.30 గంటలకు రాములు భార్య పోచవ్వ కాలకృత్యాలకు బయటకు వచ్చి చూడగా రాములు చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే కొడుకు, కోడలితో కలిసి గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పోచవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ పోలీసులు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

మాసాయిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందాడు. మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామానికి చెందిన గెంట్యాల చంద్రయ్య చిన్న కుమారుడు ప్రభాకర్(38) తూప్రాన్‌లో ప్రింటింగ్, ఫ్లెక్సీ షాపు పెట్టాడు. ఈనెల 14న షాపునకు వెళ్తున్నానని చెప్పి అదృశ్యమయ్యాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం కొప్పులపల్లి చెరువులో ప్రభాకర్ మృతదేహం కనిపించింది. గ్రామస్థుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి చంద్రమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ బాలిక మృతి



జియాకుమారి (ఫైల్)

జిన్నారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ చూడొద్దంటూ తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి.. చికిత్స పొందుతూ మృతిచెందింది. బీహార్ రాష్ట్రానికి చెందిన మనూసింగ్ ఉపాధి నిమిత్తం బొల్లారానికి వచ్చి పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మనూసింగ్ కుమార్తె జియాకుమారి(14) స్థానికంగా 8వ తరగతి చదువుతున్నది. ఈనెల 15న రాత్రి సెల్‌ఫోన్‌లో ఆడుకుంటుండగా తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన జియాకుమారి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నది. మృతురాలి అక్క కిటికీలోంచి చూడగా జియాకుమారి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే తల్లిదండ్రులకు తెలపడంతో వారు వచ్చి తలుపులు తీసి చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తండ్రి మనూసింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన యువకుడి బావిలో శవమై..



రాజు(ఫైల్)

టేక్మాల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన యువకుడి మృతదేహం బావిలో లభ్యమైంది. ఈ సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం దాదాయిపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కోటంగారి రాజు(23) ఈనెల 13న తన పొలంలో మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి దుర్గయ్య శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం తన వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న బావిలో రాజు శవమై కనిపించడంతో పోలీసులకు సమాచారమందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకుతీసి, పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు తీవ్రగాయాలు

వెల్దుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను వెనుక నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం రాత్రి వెల్దుర్తి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఆదివారం ఏఎస్‌ఐ సాదత్‌మియా తెలిపిన వివరాల ప్రకారం.. షేర్‌పల్లి గ్రామానికి చెందిన సీహెచ్.ప్రసాద్ వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని తూప్రాన్ వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు వెనక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ప్రసాద్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కొనుగోళ్లు, రవాణా విషయాల్లో ఎలాంటి అవకతవకలు జరగొద్దు


రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నిజాంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు, రవాణాపై ఎలాంటి అవకతవకలు జరగవద్దని తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామ ఐకేపీ, నందిగామ సొసైటీ కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మి, గిట్టుబాటు ధరను పొందాలని రైతులకు వివరించారు. అలాగే ధాన్యం కొనుగోళ్లు, రవాణాపై జాప్యం చేయవద్దని, రైస్ మిల్లు యజమానికి ఐకేపీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకట రాజాగౌడ్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రమేష్, రైతులు ఉన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి

మెదక్ అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సిక్కుల ఆరాధ్యదైవం గురునానక్ 555వ జయంతి వేడుకలను పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు లఖన్‌సింగ్, సూరజ్‌సింగ్‌లు గురునానక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత 75 ఏళ్లుగా మెదక్‌లో నివసిస్తున్నామని, స్థానికంగా గురుద్వార్‌కు స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎంపీ రఘునందన్‌రావును వారు కోరారు. ఈ వేడుకల్లో తారసింగ్, కిషన్‌సింగ్, గోపాల్ సింగ్, ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


మల్కాపూర్ టూ మైతాబ్‌ఖాన్‌గూడ రోడ్డుపై నిలిచిపోయిన భారీ వాహనాలు

- మల్కాపూర్ టూ మైతాబ్‌ఖాన్‌గూడ ప్రధాన రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాల్లో లోడింగ్, అన్‌లోడింగ్
- వాహనాల రద్దీ ఉండే ఈ రోడ్డుపై అడుగడుగునా అడ్డంకులే
- ప్రమాదాలు జరిగినప్పుడే తూతూ మంత్రంగా చర్యలు
- పట్టించుకోని పోలీసులు, పరిశ్రమల యాజమాన్యాలు

ప్రమాదాలు జరిగితే గానీ స్పందించరా!

కొండాపూర్,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వాహనాల రద్దీ అధికంగా ఉండే కొండాపూర్ ప్రధాన రోడ్డుపైనే భారీ వాహనాల లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండటంతో పాటు పార్కింగ్ కూడా చేయడం వాహనదారులు, స్థానికులకు తలనొప్పిగా పరిణమించింది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకొని వాహనదారులు గాయాలబారిన పడుతున్నారు.

ఆ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయం

సంగారెడ్డి, వికారాబాద్ రెండు జిల్లాలను అనుసంధానం చేసే మల్కాపూర్ టూ మైతాబ్‌ఖాన్‌గూడ ప్రధాన రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా భారీవాహనాల పార్కింగ్ చేయడంతో ప్రయాణీకులకు ఈ రోడ్డు నరకప్రాయంగా మారింది. మల్లేపల్లిలోని ఆయా పరిశ్రమలకు వివిధ రాష్ట్రాల, ప్రాంతాల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రద్దీ అధికంగా ఉంటుంది. దీనికి తోడు రోడ్డుపైనే వాహనాలను నిలపడం ఇబ్బందిగా మారింది. అదీ చాలదన్నట్లుగా లోడింగ్, అన్ లోడింగ్ కూడా అదే రోడ్డుపై అక్కడే జరుపుతుంటారు. దీంతో తరచూ వాహనదారులు రోడ్డు ప్రమాదాలబారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కంటితుడుపు చర్యలతో సరి!

ప్రమాదాలు జరిగిన సమయంలో హడావిడిగా ప్రమాద నివారణ చర్యలను తీసుకుంటూ సెక్యూరిటీ గార్డులను నియమిస్తుంటారు పరిశ్రమల యాజమాన్యం. ఆ తర్వాత షరా మామూలే. నిరంతరం ప్రమాద నివారణ చర్యలు చేపట్టాల్సిన పోలీసులు, పరిశ్రమల యాజమాన్యాలు ప్రమాదాల నివారణకు కంటితుడుపు చర్యలు మాత్రమే తీసుకుంటున్నారు. ఏమైనా పెద్ద ప్రమాదాలు జరిగితే గానీ పట్టించుకోరా అని స్థానికులు పరిశ్రమల యాజమాన్యంతో పాటు పోలీసుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారి నిర్లక్ష్య వైఖరి వాహనదారుల ప్రాణాలతో చెలగాటమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రద్దీ అధికంగా ఉండే మల్కాపూర్-మైతాబ్‌ఖాన్‌గూడ ప్రధాన రోడ్డుపై లోడింగ్ అన్ లోడింగ్‌తో పాటు భారీ వాహనాలను పార్కింగ్ చేయకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మల్లేపల్లిలో ఓ పరిశ్రమ ముందు రోడ్డుపైనే భారీ వాహనాల్లో లోడింగ్ చేస్తున్న దృశ్యం

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


భాస్కర్ (ఫైల్)

పుల్‌కల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందారు. చౌటకూర్ మండలం శివంపేట గ్రామానికి చెందిన చాక్లెట్ భాస్కర్ (47) వృత్తి రీత్యా సంగారెడ్డిలో నివాసముంటున్నారు. శనివారం విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకోగానే కొంతసేపటికి గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన 2002 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మృతుడికి భార్య ధనలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. భాస్కర్ భౌతికకాయానికి ఆదివారం సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. భాస్కర్ అకాల మరణం పట్ల పీఆర్టీయూటీఎస్, టీపీటీఎఫ్ నాయకులు ఆయన కుటుంబానికి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తేవాలి


క్రీడాకారులతో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

చేగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మారుముల గ్రామాల్లో రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషమని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగి జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ గంగాల రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అల్లి నరేష్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అయిత పరంజ్యోతి, కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్ జాతీయస్థాయికి రుషివందన

నారాయణఖేడ్, నవంబరు 17.(ఆంధ్రజ్యోతి): జిమ్నాస్టిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో నారాయణఖేడ్‌లోని ఈ-తక్షిల పాఠశాలకు చెందిన విద్యార్థిని రుషివందన చక్కటి ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శరత్ కుమార్ తెలిపారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 4 వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినికి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ


జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నారాయణఖేడ్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడాకారులకు ఆదివారం స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ జలమండలి మేనేజర్ సంతోష్‌కుమార్ తన మాతృమూర్తి కళావతి జ్ఞాపకార్థం రూ.1.50 లక్షల విలువగల స్పోర్ట్స్ దుస్తులను 80 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి కళావతి ఇదే పాఠశాలలోనే విద్యనభ్యసించి, ఉపాధ్యాయురాలుగా ఇదే పాఠశాలలో విధులు నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్మథ కిషోర్, స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భవానీ శంకర ఆలయంలో చండీహోమం

జిన్నారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొల్లారం భవానీ శంకర దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చండీహోమం నిర్వహించారు. ఈ నెల 16నుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తుండగా.. ఆలయ ఆవరణలో నిర్వహించిన చండీ హోమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హజ్రత్ గౌస్ దర్గా ఉత్సవాలు


ఉత్సవాల్లో కౌన్సిలర్, నాయకులు

జిన్నారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొల్లారం బీసీ కాలనీలోని హజ్రత్ గౌస్ దర్గా ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం దర్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి, నాయకులు సంపత్‌రెడ్డి, రాజు, గౌస్, ఖదీర్, అఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపనులు వెంటనే చేపట్టాలి

ప్రధాన రహదారిపై సిరూర్ గ్రామస్థుల రాస్తారోకో

రాయికోడు నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) అల్లాదుర్గం- మెటల్ కుంట ప్రధాన రహదారిపై కంకర మట్టి వేసి రెండేళ్లు గడిచినా దానిమీద తారు రోడ్డు వేయకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. ఆదివారం మండల పరిధిలోని సిరూర్ గ్రామ ప్రజలు ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా కూర్చొని రాస్తారోకో నిర్వహించారు దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించి ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమాచారమందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. రాయిపల్లి మంజీరా బ్రిడ్జిపై నుంచి సిరూర్ గ్రామ శివారు వరకు కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి రోడ్డుపై కంకర మట్టి పోశాడని, అయితే రెండేళ్లుగా ఆ రోడ్డుపై నీరు పట్టించకపోవడంతో పంట పొలాలపై దుమ్ము పేరుకుపోయి పత్తిపంట రంగుమారి గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై కంకర తేలి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని మండిపడ్డారు. రోడ్డుపై గుంతలు ఏర్పడిన చోట ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీ వారు మట్టిని పోశారని తెలిపారు. ఈ సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించే రోడ్డును వెంటనే నిర్మింప చేయాలని వారు కోరారు.


ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న సిరూర్ గ్రామస్థులు

తూప్రాన్ డివిజన్‌లో 70 శాతం సర్వే

- తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆదివారం వరకు 70.02శాతం సర్వే పూర్తయ్యిందని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలో 43 మంది సూపర్‌వైజర్లు, 374 ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్నట్లు వివరించారు. నార్సింగి మండలంలో 78.32శాతం, చేగుంట మండలంలో 74.38శాతం, తూప్రాన్ మున్సిపాలిటీలో 71.80శాతం, మనోహరాబాద్ మండలంలో 71.40శాతం, తూప్రాన్ మండలంలో 72.57శాతం, మాసాయిపేట మండలంలో 65.87శాతం, వెల్దుర్తి మండలంలో 57.90శాతం సర్వే పూర్తయ్యిందని తెలిపారు.

సర్వే చేస్తున్న ఉపాధ్యాయులకు స్వేచ్ఛనివ్వాలి

- పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

మెదక్ అర్బన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా చేస్తున్న ఉపాధ్యాయులను కొందరు అధికారులు ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదని, వారికి స్వేచ్ఛనివ్వాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎంతో ప్రయాస పడి ఒకవైపు పాఠశాలను, మరోవైపు సర్వేను నిర్వహిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులతో సమన్వయంతో పని చేయించుకోవాలని, ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం ఆలోచించి పని భారం తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

విశ్రాంత పోలీసు ఉద్యోగుల మెదక్ జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్

మెదక్ అర్బన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): విశ్రాంత పోలీసు ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎస్ఐ కానుగు రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల జిల్లా సమావేశంలో రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో నూతనకమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్(రిటైర్డ్ ఎస్ఐ), కోశాధికారి రాజు(రిటైర్డు ఎస్ఐ), ఉపాధ్యక్షుడిగా శంకర్(రిటైర్డుఎస్ఐ), కార్యదర్శులుగా కిషన్, అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అస్లాం ఖాన్, పోచయ్య, గౌరవ అధ్యక్షుడిగా శెట్టయ్య, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా బాలకిషన్, యాదగిరి, అనిల్‌కుమార్, సత్యనారాయణ, రమేష్, కిషన్, రాజు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

వట్ పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రజకులను ఎస్సీలుగా గుర్తించి న్యాయం చేయాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. వట్‌పల్లి మార్కెట్ యార్డులో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులవృత్తి చేస్తున్న దోబీలకు ఎస్సీ రిజర్వేషన్ అమలు చేసి ఆయా పథకాలలో లబ్ధి పొందేలా రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షుడు యాదయ్య సంఘం బాధ్యులు పుష్పలత బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పూడిపూజ



సంగారెడ్డిలో ఆదివారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం గురుస్వాముల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రదీప్ నంబూద్రి వైదిక నిర్వహణలో శబరిమలలో జరిగే విధంగా తాంత్రిక రీతిలో పూజా కార్యక్రమాన్ని జరిపించారు. జంగిరెడ్డి భజన బృందం పాడిన అయ్యప్ప భక్తిపాటలు ఆకట్టుకున్నాయి. డా.పి.స్వామిగౌడ్, పి.సంతోష్‌గౌడ్ గురుస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అయ్యప్ప గురుస్వాములు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

-సంగారెడ్డి అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి)

టీపీటీఎఫ్ సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్ష కార్యదర్శులు సోమశేఖర్, రాంచందర్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో 2024-26 రెండేళ్లకు గానూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం. సోమశేఖర్, ప్రధాన కార్యదర్శిగా రాంచందర్, ఉపాధ్యక్షులుగా బిచ్చయ్య, జనార్దన్‌రెడ్డి, నాజర్‌పటేల్, మర్రి ప్రశాంతి, విజయ్‌భాస్కర్, మల్లికార్జున్, గోవింద్, బాబురావు, విఠల్, కార్యదర్శులుగా అశోక్ కుమార్, చంద్రప్రకాశ్, నర్సింలు, సుమలత, రవీందర్, శ్రీనివాస్, మహేశ్వర్ రావు, రాధ, శ్రీనివాస్‌చార్యులు, జగన్నాథం, రాష్ట్ర కౌన్సిలర్లుగా సంజీవయ్య, సునీతా ఖన్నా, రాజారెడ్డి, లక్ష్మయ్య యాదవ్, శ్రీనివాస్, భవాని, నాగేశ్వర్, గీతామాలిని, భాస్కర్, ఖమ్రోద్దీన్, వెంకట్ రాథోడ్, సుభాష్, బాబు, భూమి శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు.

శివారు కాలనీల సమస్యలు పరిష్కరిస్తా

పటాన్‌చెరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మండల పరిధిలోని పలు శివారు కాలనీలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరిస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హామీ ఇచ్చారు. మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ తదితర గ్రామాలపరిధిలోని కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు ఎంపీని కలిసి తమ సమస్యలను వివరించారు. త్వరలోనే ఆయా కాలనీల్లో పర్యటించి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండలనాయకులు ఉన్నారు.


మస్యలపై ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న పలు కాలనీల సంక్షేమసంఘాల నాయకులు

ప్రజా పోరాటాలకు మద్దతు పలకాలి: సీపీఎం

పటాన్‌చెరు, నవంబరు, 17(ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రభుత్వాలను నిలదీసేందుకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలకాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాజయ్య కోరారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర పార్టీ మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఆదివారం పటాన్‌చెరు శ్రామికభవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఎం తిరుగుబాటు బావుటా ఎగరవేయబోతోందన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న సీపీఎం సంగారెడ్డి మహాసభలో ఎంతో కీలకమన్నారు. సమస్యలపై పోరాడుతున్న సీపీఎం పార్టీకి అన్ని వర్గాల మద్దతుదారులు తోచిన విరాళం ఇవ్వాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు సంతోష్‌కుమార్ గౌడ్, రాజశేఖర్, కిరణ్, రాజు, మోగరాజు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజయ్య

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి


శివ్వంపేట గ్రామపంచాయతీ ముందు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

శివ్వంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీరు అరకొరగా సరఫరా కావడంతో నీటికొరత ఏర్పడి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని శివ్వంపేటకు చెందిన మహిళలు అసహనం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన శివ్వంపేటలో నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యక్తులు మిషన్ భగీరథ నల్లాలకు మోటార్లు ఏర్పాటు చేస్తూ నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. ఫలితంగా ఇతరులకు నీటి తిప్పలు తప్పడం లేదని మహిళలు ఆరోపించారు. దాదాపు నెల రోజులుగా మిషన్ భగీరథ నీరు అరకొరగా సరఫరా అవుతున్నదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడం లేదని మండిపడ్డారు.

నత్నయపల్లిలో వారం రోజులుగా...

నర్సాపూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం నత్నయపల్లిలో వారం రోజులుగా తీవ్ర నీటి సమస్య నెలకొన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిషన్‌భగీరథ ద్వారా రోజు సరఫరా అయ్యే నీరు నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొన్నది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.


కోహీర్: కొత్తూరు(కె)లో బోర్ వద్ద పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

కొత్తూరులో తాగునీరు వృథా..

కోహీర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు(కె) గ్రామపరిధిలోని ప్రభుత్వ తాగునీటి బోరు వద్ద లీకేజీతో నీరంతా మురుగునీటి పాలవుతుంది. లీకేజీ వల్ల తాగునీరు వృథా కావడంతో వాటర్ ట్యాంక్‌లో నీరు ఎక్కువసేపు నిలవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. బోర్ వద్ద ఉన్న పైపులు తుప్పు పట్టిపోవడం వల్లే లీకేజీ అవుతుందని, అయినప్పటికీ అధికారులు పైపులను మార్చడం కాదుకదా కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పత్తి రైతు గోస..

(5వ పేజీ తరువాయి)

సీసీఐఅనుమతిచ్చింది. జోగిపేట, నారాయణఖేడ్, సదాశివపేట, రాయికోడ్, వట్‌పల్లి, హత్నూర, మండలాల పరిధిలోని ఎన్కెపల్లి, చందాపూర్, మేళసంగం, టి.లింగంపల్లి, నాగ్వార్, తుర్కవాడిగాం, డప్పూర్,నిజాంపేట, సత్తెగామ, బోర్పట్ల తదితర గ్రామాల్లో ఉన్న 22 జిన్నింగ్ మిల్లుల్లో ఈ నెల 10 నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కానీ, తూకం మాత్రం నెమ్మదిగా సాగుతున్నది. జిల్లాలో ఇప్పటివరకు 781 మంది రైతుల నుంచి 16,049 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగులో చేసినట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు తెలిపారు.

దళారుల దోపిడీ

అసలే దిగుబడి తగ్గి నష్టపోయిన పత్తి రైతులకు దళారుల బెడద మరింత నష్టాలపాలు చేస్తున్నారు. పత్తి క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర ఇవ్వాలని సీసీఐ నిర్ణయించింది. తేమ 8-12 శాతం ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధన దళారులకు వరంగా మారింది. కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతుండడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. జిన్నింగ్ మిల్లులు అధికారులతో దళారులు లోపాయికారి ఒప్పందం చేసుకొని తేమ శాతం ఎక్కువగా ఉన్నదంటూ జిన్నింగ్ మిల్లులు రిజెక్ట్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో దళారులు రైతులకు రూ.6,800 నుంచి రూ.7వేలు మాత్రమే ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ.500 నుంచి రూ.800 నష్టపోతున్నారు.

రైతులపై బీఆర్ఎస్ నాయకుల కపట ప్రేమ

చిన్నశంకరంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు దోచుకోవడమే తప్ప ప్రజలకు చేసిందేమీలేదని, ఇప్పుడు ఆ పార్టీ నాయకులు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తిగళ్ళ రామచంద్రం పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదగిరి, శ్రీనివాస్, మల్లేశం, నాగులు, తదితరులు పాల్గొన్నారు.

మండలి వైస్ చైర్మన్ కలిసిన బీఆర్ఎస్ నాయకులు


బండప్రకాశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిజంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్‌ను బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మండలంలోని వెంకటపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కాశబోయిన దయాకర్ ఆదివారం ఆయన నివాస గృహంలో బండ ప్రకాశ్ ముదిరాజ్‌ను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు సదాశివ గౌడ్, సాయగౌడ్ ఉన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా సంతోష్

మునిపల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): మునిపల్లి మండల విద్యుత్ శాఖ ఏఈగా సంతోష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏఈగా పని చేసిన ప్రశాంత్‌కుమార్ సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సదాశివపేట ఏడీఈ కార్యాలయంలో పని చేసిన సంతోష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.